క్లుప్తంగా

కేయూలో నేడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో బీసీ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 11న ఉదయం మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు కేయూ బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పించే కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేయూ వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి పాల్గొంటారని తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొనాలని ఆయన కోరారు.

రేపు నగరానికి దత్త విజయానంద తీర్థ రాక

హన్మకొండ కల్చరల్: అవధూత, దత్తపీఠం ఉత్తరాధికారి పరమహంస పరివ్రాజకాచార్య దత్త విజయానంద తీర్థస్వామి వరంగల్ నగరానికి శుక్రవారం రానున్నారని గణపతి సచ్చిదానంద దత్త జ్ఞానబోధ సభ ట్రస్ట్ సభ్యుడు వైవీ.వామన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ములుగురోడ్డులోని దత్తక్షేత్రంలో శుక్రవారం నవగ్రహ హోమం, పూర్ణాహూతి నిర్వహిస్తారని, శనివారం పరకాల సమీపంలోని చిన్నకోడెపాకలో జరగనున్న ఆలయ ప్రతిష్ఠ, కుంభాభిషేకం, విగ్రహాల ప్రతిష్ఠ పూజలో పాల్గొంటారని పేర్కొన్నారు.

పోలీసుల కవాతు



హసన్‌పర్తి: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని హసన్‌పర్తి పోలీసుల ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలు జయగిరి, అన్నాసాగరం, దేవన్నపేట గ్రామాల్లో బుధవారం కవాతు నిర్వహించాయి. కార్యక్రమంలో స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఎస్సై అశోక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురుద్వార్‌లో పూజలు



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ 9వ డివిజన్ పరిధి కాకతీయకాలనీలోని గురుద్వార్‌లో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. తెలుగు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పూజల అనంతరం కాకతీయకాలనీలో పర్యటించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, మైనారిటీ కమిషన్ సభ్యుడు దర్శన్‌సింగ్, గురుద్వార్ కమిటీ సభ్యులు హరిసింగ్, దీప్తిసింగ్, ఆజాద్‌సింగ్, జీత్తు, బీఆర్‌ఎస్ నాయకులు సదాంత్, ఖలీల్, అజిత్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

‘అతిథి’లో జన్మదిన వేడుకలు



హన్మకొండ చౌరస్తా: కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య జన్మదిన వేడుకలను హనుమకొండ రెడ్డికాలనీలోని అతిథి మనోవికాస కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక దివ్యాంగులతో కలిసి 5వ డివిజన్ కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ కేక్ కట్‌చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. కొట్టె ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అతిథి ఆశ్రమ నిర్వాహకురాలు సుజాత, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు



మడికొండ: వర్ధన్నపేట ఎమ్మెల్యే కర్ర్రస్ నాగరాజు దంపతులకు కాంగ్రెస్ మడికొండ గ్రామ నాయకులు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో మెట్టుగుట్ట ఆలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, నాయకులు బైరి లింగమూర్తిగౌడ్, కుర్ల మోహన్, పల్లపు అర్జున్, రాజు, వస్కుల నాగరాజు, శ్రీనివాస్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

అరూరి రమేష్‌కు సన్మానం

కాజీపేట అర్బన్: బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను 31వ డివిజన్ న్యూశాయంపేటకు చెందిన బీజేపీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామిండ్ల బాబురావు, ఖిలా వరంగల్ సొసైటీ డైరెక్టర్ షణ్ముక రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సామూహిక ప్రార్థనలకు సర్వం సిద్ధం

- నేడు ఈద్ – ఉల్ – ఫితర్
- బుధవారం దర్శనమిచ్చిన నెలవంక
- ఈద్గా, మసీదుల్లో ఏర్పాట్లు



విద్యుత్ వెలుగుల్లో రాయపురలోని మసీదు



ముస్తాబైన శంభునిపేటలోని మసీదు



ఈద్గాలో నెలవంకను చూపిస్తున్న జబ్బార్

ఖిలా వరంగల్: ఈద్ – ఉల్ – ఫితర్ ప్రత్యేక ప్రార్థనలకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఖిలా వరంగల్ ఈద్గాను ముస్తాబు చేశారు. రంజాన్ సందర్భంగా గురువారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే సామూహిక ప్రార్థనల కోసం ఈద్గా ప్రాంగణంలో వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ మహ్మద్ రియాజ్ ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. ఖిలా వరంగల్ ఈద్గా ప్రాంగణంలో జరగనున్న సామూహిక ప్రార్థనలకు సుమారు 30వేలకు పైగా ముస్లింలు హాజరై ప్రార్థనలు చేయనున్నారని, అందుకోసం తగిన సౌకర్యాలు కల్పించనున్నట్లు రియాజ్ వివరించారు.

ఆకాశంలో కనిపించిన నెలవంక

బుధవారం సాయంత్రం నెలవంక దర్శమిచ్చిందని తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్ తెలిపారు. ఈ క్రమంలో గురువారం రంజాన్ పండుగను జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారని పేర్కొన్నారు.

ముస్లిం కుటుంబానికి సరుకుల పంపిణీ

మడికొండ: రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లిం కుటుంబానికి మడికొండ హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ నిత్యావసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు దాతలు చేతనైనంత సహకారం అందించాలని జయరాజ్ సూచించారు.



హసన్‌పర్తి: కిట్ అందజేస్తున్న వెంకటేశ్వర్ రెడ్డి

రంజాన్ కిట్ల పంపిణీ

హసన్‌పర్తి: ఒకటవ డివిజన్ ముచ్చర్లలో నిరుపేద ముస్లింలకు రంజాన్ కిట్లను బీఆర్‌ఎస్ నేత చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిఏటా నిరుపేద ముస్లింలకు రంజాన్ కిట్లు అందిస్తున్నట్లు చెప్పారు. పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు ఎండీ.సమద్, శ్రీధర్, సూర ప్రమోద్, పాల్, రాజేష్, రాజు, బండా సాయిరెడ్డి, సుమన్, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.



హసన్‌పర్తి: ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

ఇఫ్తార్‌తో స్నేహభావం పెంపొందుతోంది

హసన్‌పర్తి: ఇఫ్తార్ విందులతో స్నేహభావం పెంపొందుతుందని మాజీ జెడ్పీటీసీ వింజమూరి వెంకటేశ్వర్లు అన్నారు. 66వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండల కేంద్రంలో ముస్లింలకు గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి రంజాన్ ప్రతీక అని అన్నారు. డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముస్లింలు మహ్మద్ వలీ, ఖలీల్, ఎస్‌డీ.అహ్మద్, ఎస్‌డి.ఖాజా, అన్వర్, ఇఫ్తెకార్ అలీ, కాంగ్రెస్ నాయకులు ఆరెల్లి వెంకటస్వామి, జె.రవి, పుల్లా రవి, వీసం సురేందర్‌రెడ్డి, సంపత్, పెద్దమ్మ నర్సింహరాములు, శీలం పృథ్వీరాజ్ పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న జయరాజ్

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ‘ప్రేరణ’

- జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుభాషిణి చిత్రంలో శ్రీనివాస్ తదితరులు

విద్యారణ్యపురి : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రేరణ ఉత్సవ్ దోహదం చేస్తోందని జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవ్ కార్యక్రమాన్ని భట్టుపల్లిలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం జిల్లాస్థాయి ప్రేరణ ఉత్సవ్‌లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్, పద్యరచన, పాటల పోటీలు నిర్వహించారు. 75 పాఠశాలల నుంచి 136 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన 30మంది విద్యార్థులను ఎంపిక చేసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా స్థాయి నుంచి ఒక అబ్బాయి, అమ్మాయిని ఎంపిక చేసి గుజరాత్‌లో జరిగే వారంరోజుల శిక్షణకు పంపనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

బుద్ధ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న వీసీ రమేష్



మొక్క నాటుతున్న వీసీ, ప్రిన్సిపాల్, తదితరులు

కేయూ క్యాంపస్: యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సెంట్రల్ లైబ్రరీ ఎదుట బుద్ధ విగ్రహ ఏర్పాటుకు కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల ఆదర్శాలను నేటి యువతరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, కేయూ అభివృద్ధి అధికారి ప్రొఫెసర్ వాసుదేవరెడ్డి, బుద్ధ విగ్రహదాత పార్ట్‌టైం అధ్యాపకుడు డాక్టర్ చింతం ప్రవీణ్, కుక్టా అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా, బుద్ధ విగ్రహ దాత చింతం ప్రవీణ్‌ను వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ అభినందించారు.

పచ్చదనంతో కళకళలాడాలి

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పరిసరాలు పచ్చదనంతో కళకళలాడాలని కేయూ వీసీ ప్రొఫెసర్ తాడికొండ రమేష్ ఆకాంక్షించారు. పచ్చదనం, పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధ్యాపకులను కోరారు. ఆర్ట్స్ కళాశాలలో బోధనేతర సిబ్బంది ఆఫీస్ ఆవరణలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డితో కలిసి వీసీ రమేష్ బుధవారం పలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, బోధనేతర సిబ్బంది, అసోసియేషన్ బాధ్యుడు రాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, కేయూ అభివృద్ధి అధికారి ప్రొఫెసర్ వాసుదేవరెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సరళాదేవి, డాక్టర్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియామకం



హన్మకొండ : కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఆదివాసీ కాంగ్రెస్ (ఎస్టీ డిపార్ట్‌మెంట్) వరంగల్ జిల్లా చైర్మన్‌గా గుగులోత్ రవీందర్ నాయక్‌ను నియమించినట్లు టీపీసీసీ ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్ తెలిపారు. కాంగ్రెస్‌లో చురుకైన కార్యకర్తగా పనిచేస్తూ జిల్లాలో పార్టీ పటిష్టతకు పాటుపడుతున్న సంగెం మండలం పెద్దతండాకు చెందిన రవీందర్ నాయక్‌ను నియమించినట్లు బుధవారం ఆయన ప్రకటనలో వివరించారు. జిల్లాలో ఆదివాసీ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని సూచించారు. కాగా తనను ఈ పదవిలో నియమించాలని సూచించిన కేంద్ర, రాష్ట్ర, జిల్లా నాయకులకు రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు.

చిమ్ని మిత్ర పురస్కారం ప్రదానం



కాజీపేట: గత కొన్నేళ్లుగా తెలుగు సాహిత్య కృషిని ప్రశంసిస్తూ 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన శనిగరపు రాజ్‌మోహన్‌కు చిమ్ని మిత్ర పురస్కారాన్ని బుధవారం ప్రదానం చేశారు. నిర్మల్ జిల్లా బైంసా శ్రీహంస వాహిని సాహిత్య కళాపాతం ఆధ్వర్యంలో అవార్డుకు ఆయనను ఎంపిక చేశారు. తెలుగు సాహిత్య ప్రక్రియలో రాజ్‌మోహన్ 600లకు పైగా కవితలు రాయడంతో పాటు తెలుగు భాషా సంస్కృతిని నలుదిశలా చాటుతున్నారు. కాజీపేట శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో ఆస్థాన కవిగా, గాయకుడిగా, వ్యాఖ్యాతగా వ్యవహరిస్తుండడంతో ఆయనకు భక్తులు, ఆలయ అర్చకులు అభినందనలు తెలిపారు.

‘సఖి’ సేవలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ

కాజీపేట అర్బన్: సఖి వన్ స్టాప్ కేంద్రం సేవలను బాధిత మహిళలు, బాలికలు వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ సూచించారు. ‘ఆడపిల్లలపై జరుగుతున్న అకృత్యాలు, లింగ వివక్ష’ అనే అంశంపై న్యూశాయంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు శారీరకంగా, మానసికంగా, లైంగికంగా, ఆర్థికంగా ఇంటిలో, సమాజంలో ఎదుర్కొంటున్న పలు రకాల వేధింపులు, హింస నుంచి రక్షణ కల్పించడానికి, బాధితులకు అన్ని రకాల సహాయాన్ని అందించేందుకు సఖి కేంద్రం కృషి చేస్తోందని వివరించారు. బాధితులు ఎప్పుడైనా హెల్ప్‌లైన్ 181 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. మహిళలు ఉన్నత విద్యను అభ్యసించి అన్నిరంగాల్లో ఎదగాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సరోజ, డీహెచ్‌ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ స్వర్ణలత, కేస్ వర్కర్ వినీల, విద్యార్థినులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



సైన్స్ కిట్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

హసన్‌పర్తి: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి సూచించారు. హసన్‌పర్తి మండలం చింతగట్టులోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి చెక్ముఖి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను బుధవారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూఢ నమ్మకాలను నమ్మొద్దని సూచించారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని చెప్పారు. చిన్నప్పటి నుంచే శాస్త్రీయ భావజాలాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్ కిట్లను అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయుడు రాజేందర్, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి ‘ఉగాది పౌర పురస్కారం’



పురస్కార గ్రహీతలను సన్మానిస్తున్న నిర్వాహకులు

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ముగ్గురు వ్యక్తులకు ఉగాది ఉత్తమ పౌర పురస్కారాలను శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందించినట్లు ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ తెలిపారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ములుగు రోడ్డులోని సప్తగురుధామంలో ములుగు జిల్లా ఏటూరునాగారానికి చెందిన డాక్టర్ బి.వరప్రసాద్, కూచిపూడి నాట్యాచార్యుడు బొంపెల్లి సుధీర్‌రావు, హనుమకొండ ట్రినీ ఐఏఎస్ సాయి ఆశ్రిత్‌కు అవార్డులు అందజేసి రూ.5116లు నగదు అందజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జీహెచ్‌ఎంసీ విజిలెన్స్ అధికారి, ఏసీపీ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వేలాదిమంది నిరుపేదలకు డాక్టర్ వరప్రసాద్ ఉచిత వైద్య సేవలందిస్తున్నారని, అనేక మంది పిల్లలకు కూచిపూడిలో బొంపెల్లి సుధీర్ శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువస్తున్నారని, సివిల్స్‌లో జాతీయ స్థాయిలో శ్రీసాయి ఆశ్రిత 40వ ర్యాంకు సాధించి ఆల్ ఇండియా ఇంటర్వ్యూలో 2వ ర్యాంకులో నిలిచారని ప్రశంసించారు. కార్యక్రమంలో బండారు సాయినారాయణ, మాదారపు సదాశివుడు, పబ్బ విశ్వేశ్వర్, వెంకటరమణ, సుదర్శన్‌రావు, స్వామికృష్ణ, చైతన్యఆనంద, రాంరెడ్డి, ప్రియాంక, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: గ్రేటర్ కార్పొరేషన్‌లో 2021వ సంవత్సరంలో చేరిన 452 మంది కార్మికులకు మార్చి నెల జీతాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ నేతలు కోరారు. ఈమేరకు ఎంహెచ్‌ఓ రాజేశానికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య మాట్లాడుతూ 452 మంది కార్మికులు పనిచేయకుండా జీతాలు తీసుకుంటున్నారని చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మి మున్సిపల్ ఉన్నతాధికారులు వారిని ఇబ్బందులకు గురిచేయటం తగదని హితువు పలికారు. నిజాయితీగా పనిచేసే కార్మికులకు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని తీసివేసి మార్చినెల జీతాన్ని ఇవ్వాలని కోరారు.

డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ నాగబాబు

కాజీపేట: ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ నాగబాబు సూచించారు. కాజీపేట ప్రధాన రహదారిపై మడికొండ, ధర్మసాగర్ గ్రామాల ఆటోల అడ్డా కార్మికులకు ఆయన పలు సూచనలు చేశారు. ఆటో డ్రైవర్లు లైసెన్స్‌తో పాటు వాహన పత్రాలు కలిగి ఉండాలని చెప్పారు. లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని అన్నారు. ఒకవేళ ప్రయాణికులు తమ వస్తువులను ఆటోలో మరిచిపోయి దిగివెళ్లిపోతే ఆ సామగ్రిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని అన్నారు. కార్యక్రమంలో ఆటో అడ్డా నాయకులతో పాటు ఎస్సైలు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉత్తమ విశ్వబ్రాహ్మణులకు సన్మానం’



ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ మొరుపోజు గౌతంకు పురస్కారం అందజేస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ కల్చరల్: ఉగాది పండుగను పురస్కరించుకుని హనుమకొండ జిల్లా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో పలు రంగాల్లో ఉత్తమ సేవలందించిన విశ్వబ్రాహ్మణులను సన్మానించి, ఉగాది పురస్కారాలు అందజేశారు. హనుమకొండలో సంఘం జిల్లా అధ్యక్షుడు అలుగోజు కృష్ణమూర్తి అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ప్రొఫెసర్ కొక్కొండ విజయబాబు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ మంచి మార్పునకు ఉగాది నాంది కావాలన్నారు. కృష్ణమాచార్యులు మాట్లాడుతూ వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి ప్రతీ సంవత్సరం పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు గుర్తుచేశారు. అనంతరం వేదపండితుడు అల్లోజు వెంకటనారాయణాచార్యులు పంచాంగ శ్రవణం చేశారు. ఇటికాల సనాతనాచార్యులు రచించిన ఉగాది విశిష్టత పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ పొలాస రమేష్, సంఘం ఉపాధ్యక్షులు వీణవంక సదానందం, సురేష్‌కుమార్, గజ్జల వీరన్న, సోమేశ్వరచారి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం



ఖిలా వరంగల్: రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని, యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ కోరారు. రవికుమార్ జన్మదినం సందర్భంగా వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లో జీఆర్‌కే యువసేన ఆధ్వర్యంలో పలువురు రక్తదాన శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఒక రక్తపు చుక్క నిండు ప్రాణాన్ని నిలబెడుతుందని వివరించారు. అనంతరం రక్తదాతలను అభినందించి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. రక్తదాతల నుంచి 40 యూనిట్ల రక్తాన్ని ఎంజీఎం రక్తనిధి కేంద్రం వైద్యులు సేకరించారు.

హనుమాన్ శోభాయాత్ర కరపత్రాల ఆవిష్కరణ



హనుమాన్ శోభాయాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హిందూ సంఘాల నాయకులు

కాజీపేట: వీర హనుమాన్ శోభాయాత్ర కరపత్రాలు, పోస్టర్లను కాజీపేట పట్టణ మీడియా పాయింట్ ఆవరణలో హిందూ సంఘాల నాయకులు బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తల ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన నగరంలో నిర్వహించనున్న శోభాయాత్రను విజయవంతం చేయాలని వారు కోరారు. వీహెచ్‌పీ వరంగల్ మహానగర కార్యదర్శి శ్రీరామ్ ఉదయ్‌కుమార్, భజరంగ్‌దళ్ సురక్ష ప్రముఖ్ కొల్లూరి ఆదిత్యసాయి, దార ధనుంజయ్, దుప్పెటి అరవింద్, గొడుగు వినయ్, అరుణ్, విజయ్, లక్ష్మణ్, నాగార్జున, సిద్ధు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రామయ్య కల్యాణ వేడుకలు ప్రారంభం

కాజీపేట: స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయ ఆవరణలోని సీతారామచంద్ర స్వామి కల్యాణ వేడుకలను ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణశర్మ బుధవారం ప్రారంభించారు. దేవతామూర్తులతో పాటు ఉత్సవ విగ్రహాలకు ఆలయ అర్చకుడు టంటం హరిస్వామి బుధవారం అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. భక్తులకు ఆలయ పరిపాలన అధికారి సాయికృష్ణ శర్మ తీర్థ ప్రసాదాల వితరణ చేయగా, కార్యకర్తలు మహాన్నదానం చేశారు.

వాటర్ ట్యాంక్ ఘటనలో కాంట్రాక్టర్‌పై కేసు నమోదు

రామన్నపేట: వరంగల్ బస్టాండ్ కూల్చివేతలో భాగంగా వాటర్ ట్యాంక్ కూల్చివేసే క్రమంలో ఖానాపూర్ మండలానికి చెందిన బొంతు రవి(40) శిథిలాల కిందపడి మృతి చెందాడు. వాటర్ ట్యాంక్ కూల్చే కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్ షకీల్, సబ్ కాంట్రాక్టర్ ఖలీల్ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా డ్రిల్లింగ్ పరికరంలో కూల్చివేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు రవి మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

తల్లీకూతురు అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతల్‌కు చెందిన ఓ మహిళ తన కుమార్తెతో కలిసి అదృశ్యమయింది. ఇన్‌స్పెక్టర్ మల్లయ్య కథనం ప్రకారం కుటుంబ కలహాల కారణంగా 36వ డివిజన్ చింతల్ ప్రాంతానికి చెందిన గుజ్జ కుమార్ భార్య స్వరూప, 14ఏళ్ల కుమార్తెతో కలిసి మంగళవారం ఇంటిలో నుంచి బయటి వెళ్లిపోయింది. కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.